క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి



సూచనలు ఇస్తున్న డాక్టర్ ధనుష్

పుత్తూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ధనుష్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక వైద్య విధాన పరిషత్ ఆవరణలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతిరోజూ మితాహారంతో పాటు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షల చేయించుకోవడం ద్వారా జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి అరికట్టవచ్చని తెలిపారు. అలాగే మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మంచి అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ దిల్షాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన సుబ్రమణ్యం నాయుడు

శ్రీరంగరాజపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు నుంచి నగరికి విధులకు బైక్‌లో వెళ్తుండగా చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి మర్రిపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సుబ్రమణ్యంనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి



మృతదేహం వద్దనివాళులర్పిస్తున్న సెల్వమణి

నింద్ర: మండలంలోని మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధరం కుమారుడు శ్రీనివాసన్ సోమవారం మృతి చెందారు. మృతదేహానికి మంత్రి రోజా భర్త సెల్వమణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు ఎంపీపీ దీప, మండల కన్వీనర్ వేణురాజు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, శెల్వం, బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, మహేష్, తదితరులు ఉన్నారు.

సర్వభూపాల వాహనంపై రామయ్య



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి శ్రీకోదండరామస్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 7 గంటలకు స్వామివారి కల్పవృక్ష వాహన సేవ వేడుకగా నిర్వహించారు. శ్రీకోదండరామస్వామి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టార్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేము ప్రజాసేవకే అంకితం

- మీ నిర్ణయాలే బంగారు భవిష్యత్తుకు పునాదులు
- మా తండ్రి నారాయణస్వామి అడుగుజాడల్లో నడుస్తా
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి
- జీడీనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి
- యువతలో జోష్ నింపిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి





వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, వెదురుకుప్పంలో డ్యాన్సు వేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కృపాలక్ష్మికి మంగళ హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

వెదురుకుప్పం: ''ప్రజాసేవకే నా జీవితం అంకితం.. మీకు సేవ చేసే భాగ్యం కల్పించండి.. మీలో ఒక్కరిగా మీ అడుగుజాడల్లో నడుస్తూ గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా'' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కే.కృపాలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కొమరగుంట సచివాలయ పరిధిలోని దామరకుప్పం, ఇనాంకొత్తూరు, అయ్యన్నగారిపల్లె, ఎస్సీ కాలనీ, జీటీ కండ్రిగ, నాయని రెడ్డి ఇండ్లు, వెదురుకుప్పం సచివాలయ పరిధిలోని తూర్పు ఎస్సీ కాలనీ, తంగేళిమిట్ట, చవటగుంట, వెదురుకుప్పం, సీఆర్‌కండ్రిగ, ఎస్సీ కాలనీ, గుండుపల్లె గ్రామాల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ వర్ణవివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాలను అందించి పేదల మోములో చిరునవ్వులు పూయించిన జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలన్నారు.

మోసకారి చంద్రబాబు..

మోసకారి చంద్రబాబు మాటలను నమ్మి ప్రజలు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే పేదలందరికీ మంచి జరగాలంటే జగనన్నకు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. పేదల ముంగిట్లోకి వచ్చిన సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలన్నదే మన ఆకాంక్ష అన్నారు.

మంగళహారతులతో స్వాగతం..

ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున మంగళ హారతులు, కర్పూర నీరజనాలు పట్టి స్వాగతం పలికారు. అదేవిధంగా యువకులు డప్పువాయిద్యాలతో సందడి చేశారు. పెద్దఎత్తున బాణసంచా పేల్చి జైజగన్ నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. జేసీబీల సాయంతో డిప్యూటీ సీఎంకు గజమాలలు వేశారు.

జోష్ నింపిన డిప్యూటీసీఎం

వెదురుకుప్పంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి కాలు కదిపి డ్యాన్స్ వేసి అందరిలో జోష్ నింపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండి గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఎంపీటీసీలు రాధిక, మునిచంద్రారెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, మాజీ ఎంపీపీలు అరుణ, జ్ఞానమ్మ, పురుషోత్తం, మాజీ మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు శిల్ప, మమత, గోవిందయ్య, ద్రాక్షాయణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మునిరత్నంరెడ్డి, గురవారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాధారెడ్డి, పెద్దిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, గోవిందన్, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, సీనియర్ నాయకుడు సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ భీమశంకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అత్తూరు సురేష్ రెడ్డి, యువత మాజీ మండల అధ్యక్షుడు నరేష్ రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మునిక్రిష్ణారెడ్డి, బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జగదీశ్‌రెడ్డి, వెంకటేశ్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, ఢిల్లీరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, బొజ్జారెడ్డి, నాగరాజు, దాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మండలపూజ హోమాలు



మంత్రి భర్త ఆర్కే సెల్వమణికి కలశాన్ని అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

నగరి: నగరి మున్సిపల్ పరిధిలోని సత్రవాడ గ్రామంలో ఇటీవల ద్రౌపతి అమ్మవారి కుంభాభిషేకం వైభవంగా నిర్వహించిన విషయం విధితమే. కుంభాభిషేకం అనంతరం 48 రోజులపాటు నిర్వహిస్తూ వచ్చిన మండల పూజలు సోమవారం ముగింపుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమపూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మంత్రి ఆర్కే రోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పాల్గొన్నారు. పూజలు అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ గతేడాది ఆలయానికి పొంగళ్లు పెట్టడానికి స్థలం కావాలని కోరగా మంత్రి ఆర్కేరోజా వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులతో చర్చించి తమకు స్థలాన్ని కేటాయించారన్నారు. అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండలపూజ కలశాన్ని ఆయనకు అందజేశారు. ఈ కారణంగా ఉత్సవాల సమయంలో పొంగళ్లు పెట్టడానికి ఉన్న సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేత అనుబంధ విభాగం అధ్యక్షుడు కన్నాయిరం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, భూపాలన్, నాయకులు ఇలంగో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే సంక్షేమం



ప్రచారం చేస్తున్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి

- రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి

నగరి: ప్రజల సమస్యలపై తక్షణం స్పందించే పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ఈ ప్రభుత్వంలోనే సంక్షేమం కొనసాగిందని మంత్రి ఆర్కేరోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపే కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తక్షణం స్పందించే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఇది నోటిమాట కాదని మంత్రి పరిష్కరించిన ప్రజా సమస్యలే అందుకు సాక్ష్యాలన్నారు. ఇప్పటివరకు నగరికి పార్కు లేదని ప్రజలకు అందుబాటులోకి పార్కును తెచ్చిన ఘనత మంత్రి రోజాదే అన్నారు. కీళపట్టుకు రావడానికి ఉన్న లోతట్టు వంతెన వరద నీరు వచ్చిన ప్రతిసారి తెగిపోవడంతో పాటు అటు నుంచి ఇటు రావడానికి ఇబ్బందికరంగా మారుతోందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి మంత్రి ఆర్కేరోజా నదిపై పక్కాగా వంతెనను నిర్మించడానికి రూ.8.4 కోట్లు మంజూరు చేయించారన్నారు. నిర్మాణం త్వరలో జరుగుతుందన్నారు. ప్రజల రాకపోకలకు రోడ్డును కూడా ఏర్పాటు చేశామన్నారు. కీళపట్టు ప్రజలకు ఫంక్షన్లు చేసుకోవడానికి రూ.40 లక్షల నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. వాస్తవాలు చెప్పే పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అజ్జెమ్మ, యాకోబు, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, నాయకులు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ధనశేఖర్, జబరాజ్, సెల్వం, వేలాయుధం, జీవా, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వేడుకగా శ్రీగోవిందరాజ స్వామికి ఆస్థానం

తిరుపతి కల్చరల్: అన్నమయ్య వర్ధంతి కార్యక్రమాల చివరి రోజు సోమవారం అన్నమాచార్య కళామందిరంలో శ్రీగోవిందరాజ స్వామివారి ఆస్థానం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర స్వామికి పరమభక్తుడైన అన్నమయ్య వెలిసిన అన్నమాచార్య కళామందిరానికి శ్రీగోవిందరాజస్వామి ఉత్సవర్లు వేంచేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా నాలుగు కాళ్ల మండపం, తీర్థకట్టవీధి మీదుగా అన్నమాచార్య కళామందిరానికి తీసుకొచ్చారు.

ఆధ్యాత్మిక సమైక్యత కోసం అన్నమయ్య కీర్తనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్: ఆనాడు ప్రజల్లో అడుగంటిన భక్తి భావాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వర స్వామివారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించారని ఎస్వీయూ విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య సర్వోత్తమరావు తెలిపారు. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన అన్నమయ్య 521వ వర్ధంతి కార్యక్రమాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజైన సోమవారం నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య సర్వోత్తమరావు అన్నమయ్య ప్రభోదము అనే అంశంపై ఉపన్యసించారు. హైదరాబాద్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య భూమయ్య అన్నమయ్య–ఆధ్యాత్మికత అనే అంశంపై ప్రసంగించారు. తిరుపతికి చెందిన జీడీ నాయుడు అన్నమయ్య–అలమేలు మంగ శతకం అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన రఘునాథ్ బృందం, విశాలాక్షి బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు



జీడీనెల్లూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్

గంగాధర నెల్లూరు: ఎండలు రోజురోజుకు పెరుగుతున్నందున పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ వెంకటప్రసాద్ ఆదేశించారు. జీడీ నెల్లూరు పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో టీబీ వ్యాధిగ్రస్తులు ఇప్పటి వరకు ఎంతమంది ఉన్నారు ? ఎంతమంది వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు, మాత్రలను పంపిణీ చేస్తున్నారు ? కొత్తగా రోగులను ఎవరినైనా గుర్తించారా ? అని వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే వారి సంఖ్య పెరగవచ్చని, అందువల్ల అనుగుణంగా సెలైన్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన ఆస్పత్రి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సీహెచ్ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, డీపీఎంఓ రవి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



నెట్టేరిలో ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించి పేదల బతుకుల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం నెట్టేరి పంచాయతీలో మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పార్టీలకు, కులమతాలకు అతీతంగా అందించిన ఘనత జగనన్నదే అన్నారు. తిరిగి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అందుకే మరోమారు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. నగరి నియోజకవర్గంతో పాటు అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి రోజాను మరోమారు నగరి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్, నాయకులు వీరయ్య, దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, గోపి, హేమాద్రి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వేధింపులు తాళలేక ..



నింద్ర సచివాలయం వద్ద రాజీనామా పత్రాలతో వలంటీర్లు

- 23 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా




పాతార్కాడులో ఏఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

నగరి: నగరి నియోజకవర్గం నింద్ర మండల కేంద్రమైన నింద్ర సచివాలయానికి చెందిన 20 మంది వలంటీర్లు, విజయపురం మండలం పాతార్కాడుకు చెందిన ముగ్గురు వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. నింద్ర సచివాలయ పరిధికి చెందిన 20 మంది వలంటీర్లు వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ భవానీకి అందజేయగా, పాతార్కాడుకు చెందిన వలంటీర్లు ఏఓ రమణప్రకాష్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నేతల వేధింపుల కారణంగానే తాము రాజీనామా చేస్తున్నామని తెలిపారు. ప్రతి విషయంలో తమను తప్పుబడుతున్నారని అది తమను మనోవేదనకు గురి చేస్తోందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి తాము సేవ చేశామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించామన్నారు. ఏనాడూ తాము పార్టీలు చూడలేదన్నారు. అలాంటి తమను టీడీపీ నేతలు వేధింపులకు గురిచేయడమే కాకుండా మాపై ఫిర్యాదులు చేసి మమ్మల్ని పెన్షన్ పంపిణీ నుంచి పక్కన పెట్టడం బాధించారని అందుకే రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి అయోధ్య టవర్స్‌కు చెందిన ఏ.జయరామిరెడ్డికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంతారావు సోమవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది పాకాల కమ్మవీధికి చెందిన ఎస్.గోవర్ధన్ బాబు తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. జయరామిరెడ్డి తన అవసరాల కోసం 2012 జూన్ నెలలో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదే ఏడాది జూలై 22వ తేదీ రూ.5 లక్షలు విలువ చేసే చెక్కును ఆయన గోవర్ధన్‌బాబుకు ఇచ్చాడు. అది బౌన్స్ కావడంతో గోవర్ధన్‌బాబు కోర్టులో కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జయరామిరెడ్డికి ఏడాది జైలు శిక్ష, అలాగే రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండండి




వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం ఎండలు తీవ్రత వీపరీతంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలో తిరిగే వారు నీరు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ఎక్కువగా తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షలకు వచ్చే వృద్ధులు, గర్భిణులకు వడదెబ్బ గురించి సిబ్బంది వివరించాలన్నారు. ఉదయం 10 గంటలు దాటాకా ఇంటి నుంచి బయటకు రావొద్దని సూచించారు. వడగాడ్పుల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. దీంతో ఎండలో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ వడదెబ్బకు గురైనా తక్షణం ఉపశమనం కలిగించేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని తెలిపారు. పీహెచ్‌సీల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

తాగునీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక





మాట్లాడుతున్న కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, హాజరైన సిబ్బంది

పుత్తూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, అసిస్టెంట్ ఇంజినీర్లు, వార్డ్ అమెనిటీస్ సెక్రెటరీలు, ఫీల్డ్ స్టాఫ్‌తో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలోనే ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో రానున్న మే, జూన్ నెలల్లో ఎదురయ్యే నీటి సవాళ్లను పక్కా ప్రణాళికతో అధిగమించాలని సూచించారు. అలాగే పట్టణానికి అనునిత్యం వచ్చే ప్రజల సౌకర్యార్థం పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం జనరల్ ఎలక్షన్స్‌పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈవీఎంఎస్, స్వీప్ కమ్యూనికేషన్స్ అవసరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్లు, సపోర్ట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డు లేకున్నా ఓటు వేయవచ్చు

నగరి: ఎపిక్ కార్డు (ఓటరు గుర్తింపుకార్డు) లభ్యం కాని సమయంలో ఓటును వినియోగించుకోవడం మరింత సులభతరం చేయు నిమిత్తమై ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఒకదాన్ని చూపించి ఓటు హక్కును వినియోగించు కోవచ్చని ఎన్నికల అధికారి ఆర్డీఓ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిక్ కార్డు లభ్యం కాని సమయంలో ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోగ్రాఫ్‌తో ఉన్న పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ అయిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పిఆర్ కింద ఆర్జీఐచే జారీ చేయబడిన స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోగ్రాఫ్ ఉన్న పింఛను డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పీఎస్‌యూలు, ప్రభుత్వ రంగసంస్థల ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోగ్రాఫ్ ఉన్న సర్వీసు ఐడెంటిటీ కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ అందించిన ప్రత్యేక వైకల్య గుర్తింపుకార్డు వినియోగించి ఓటు వేయవచ్చన్నారు.